కథ

# నైవేద్యం

ఆ పండుగంటే ప్రత్యేకించి విద్యార్థినీ విద్యార్థులందరికీ చాలా ప్రీతికరం. విఘ్నాల నుండి బయటపడేసే వినాయకుడి పండుగ కదా! తీరా రానే వచ్చింది.

ఇల్లంతా పిండివంటల వాసనతో ఘుమఘుమలాడుతోంది. పేపరు చదువుతూనే ''రాజ్యం...రాజ్యం'' అని పిలిచాడు ప్రభాకరం ఏదో గుర్తొచ్చినట్టు.

పెళ్లయి పదేళ్లు దాటినా ఏనాడూ కోపతాపాలు లేకుండా ఏ అరమరికలు లేకుండా సంసారయాత్రలో పయనిస్తున్న జంట వాళ్లది. ప్రేమించి పెళ్లాడకపోయినా ప్రేమానుబంధాలకు కొత్త నిర్వచనం వాళ్లు.

ఒకరి మనసును ఇంకొకరి ముఖంలో చూడొచ్చన్నంత అన్యోన్యత వాళ్ల కాపురం. విశాలమైన ఆమె ముఖంలో అసహనం ఏ కోశానా కనిపించదు. అనునిత్యం చిరునవ్వు ఆమె పెదాలపై నాట్యమాడుతుంటుంది.

భర్త ఎందుకు పిలిచాడో ఆమెకు అర్థమయింది.

''ఎందుకండీ? వస్తున్నా! ఒక్క నిముషం'' అంటూనే వంట గది నుండి వచ్చింది రాజ్యం.

''పులిహోర, బూరెలు...'' అని ఇంకెవరికో కూడా వినబడాలన్నట్టు బిగ్గరగా చెబుతున్న రాజ్యాన్ని-

''ఆ...నెమ్మది నెమ్మది. అమ్మ వింటుంది'' అన్నాడు ప్రభాకరం.

ఆ మాటకు నవ్వొచ్చిన రాజ్యం ''అమ్మో ఎంత భయమో ఆకాశాన్ని అంటుకుపోతోంది'' అని చిన్న జోక్ పేల్చింది.

''ఏయ్...ఏయ్! నేను సీరియస్‌గా అడుగుతుంటే జోకులేస్తావా? ఆకలి దంచేస్తోందోయ్. వంటకాలేంటో చెప్పండి మేడమ్. అవి ఆలకిస్తేనైనా కొంత ఆకలి తీరుతుందేమో'' ఛలోక్తిగా అన్నాడు ప్రభాకరమ్.

''ఇప్పటివరకూ పిల్లలే అనుకున్నాను. మీరూ తయారైతే ఎలా? ఇక మా పని అయినట్టే!'' చిన్నగా నిట్టూర్చి ''మహానుభావా! పులిహోరా, వుండ్రాళ్ళు, కుడుములు, బూరెలు, గారెలు, పెరుగు ఆవళ్ళు...'' అంది రాజ్యం.

''అవునూ! అన్నీ స్వీట్లేనా? గారెలంటే?'' ప్రశ్నార్థకంగా రాజ్యం ముఖంలోకి చూశాడు ప్రభాకరం.

''గారెలు కూడా స్వీట్లే బాబు. మొన్న పొలం నుండి వచ్చిన చెరుకు పానకం వుంది చూశారూ అందులో వేశాను. అవతల బోలెడంత పనుంది సార్. మీ కర్ణకుటీర విస్తరిలో వడ్డించిన ఫలహారాలు తింటూ ఓ గంట కాలక్షేపం చెయ్యండి చాలు'' అని చేతికున్న గారెల పిండి కాస్త బుగ్గకంటించి వంట గదిలోకి దారి తీసింది రాజ్యం.

అయిదు నిముషాల తర్వాత లోపలి నుండి పిలుపు

''ఒరే ప్రభాకరం! కాస్త పిల్లల్ని తీయరా. ఓవైపు నుండి వండుతుంటే ఇంకోవైపు నుండి తినేస్తానని గోల చేస్తున్నారు. పాపంరా. దేవుడికి నైవేద్యం చెల్లించాలి. నా మాట వినడంలేదురా'' అన్న తల్లి పిలుపుకు ''ఏమిటమ్మా నువ్వూ నీ చాదస్తమూనూ'' సణుక్కుంటూ అసహనంగా లేచాడు కుర్చీలోంచి. అతి కష్టంమీద పిల్లలిద్దర్నీ వంట గది నుండి బయటకి తీసుకువచ్చాడు. వాళ్ల చేతుల్లో రెండు బిస్కెట్ ప్యాకెట్లు పెట్టి ఊరడ్డించాడు.

అమ్మా! ఆకలి. నిన్నటి నుండి తిండిలేక కళ్లు తిరుగుతున్నాయి తల్లీ. బతికి చెడ్డవాడ్ని. ఈ పండగ పూటైనా కాస్త ఫలహారం పెట్టండమ్మా'' అన్న పలుకులు పేపర్లో లీనమైన ప్రభాకరమ్ చెవుల్లో ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఒక్కసారిగా హృదయమంతా ద్రవించినట్టయింది. కిటికీలోంచి తొంగి చూశాడు. వార్ధక్యం మీదపడి దండిస్తుంటే ఆకలి కడుపును మండిస్తోంది. వీటి ప్రభావానికి శూన్యంగా మిగిలిన భవిష్యత్తు. అతడ్ని చూడగానే ఏదో ఆవేదన ముంచుకొచ్చినట్లయింది ప్రభాకరానికి. ''ఉండయ్యా! ఒక్క నిముషం'' అని గదిలోకి వచ్చాడు.

మళ్లీ పేపర్లో లీనమయ్యాడు.

ప్రభాకరం తల్లి అనసూయమ్మ. భర్త రాజగోపాలం ఈ లోకాన్ని విడిచి చాలా కాలమయింది. అప్పటినుండి ఏకైక కుమారుడు ప్రభాకరం సంరక్షణలో, దైవ కార్యాలతో శేష జీవితాన్ని గడుపుతోంది. ఆ గ్రామంలో వాళ్లది ఆది నుండి ధనిక కుటుంబం. రాజగోపాలం బ్రతికున్న రోజుల్లో దైవకార్యాలకు, సేవా కార్యాలకు ఆ ఇల్లు వేదికగా వుండేది. చుట్టుప్రక్కల గ్రామాలలో మంచి పేరు, పలుకుబడి ఉన్న కుటుంబం వాళ్లది.

మరో పదినిముషాలు గడిచేసరికి-

''అమ్మా! ఆకలి. నిన్నటి నుండి తిండిలేక కళ్లు తిరుగుతున్నాయి తల్లీ. బతికి చెడ్డవాడ్ని. ఈ పండగ పూటైనా కాస్త ఫలహారం పెట్టండమ్మా'' అన్న పలుకులు పేపర్లో లీనమైన ప్రభాకరమ్ చెవుల్లో ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఒక్కసారిగా హృదయమంతా ద్రవించినట్టయింది. కిటికీలోంచి తొంగి చూశాడు. వార్ధక్యం మీదపడి దండిస్తుంటే ఆకలి కడుపును మండిస్తోంది. వీటి ప్రభావానికి శూన్యంగా మిగిలిన భవిష్యత్తు. అతడ్ని చూడగానే ఏదో ఆవేదన ముంచుకొచ్చినట్లయింది ప్రభాకరానికి. ''ఉండయ్యా! ఒక్క నిముషం'' అని గదిలోకి వచ్చాడు.

పాతబట్టల పెట్టెలోంచి ఏరి ఒక పంచెతీసాడు. వంట గదిలోకి వెళ్లి ఒక విస్తరిలో కాస్త పులిహోర, కొన్ని బూరెలు తీసాడు. తల్లి కంగారుగా ''ఏమిట్రా! ప్రభాకరమ్? ఎందుకవి? ఎవరికి?'' ప్రశ్నల వర్షం కురిపించింది.

''ఏమీలేదమ్మా...ఎవరో పాపం'' అని చెబుతుండగానే...

''ఏమిట్రా! దేవుడికింకా నైవేద్యమైనా పెట్టలేదు. నైవేద్యం చెల్లించకుండా ఎవరికీ పెట్టకూడదురా. మన పిల్లల్నే తినొద్దంటే ఎవరో ముష్టివాళ్లకు పెడుతున్నావటరా?'' అంటూ ఆవేదనంతా వెళ్లగ్రక్కింది.

తల్లి వారిస్తున్నా బయటకెళ్లి ఆ బ్రతికి చెడ్డవాడి చేతుల్లో అవి పెట్టి వచ్చాడు ప్రభాకరం.

''ఒరేయ్ ప్రభాకరం! ఎంత పని చేశావురా? పండుగపూట ఇదేం పనిరా? ఎంత అపచారం? ఎంత అపచారం? దేవుడికి కోపం వస్తుందిరా!..'' అంటున్న తల్లికి అడ్డువచ్చి ''చూడమ్మా! మానవసేవే మాధవసేవ అని ఎందరో మహానుభావులు చెప్పారు.''

''అదికాదురా...'' అని ఇంకేదో చెప్పాలనుకుంటున్న తల్లిని ''వద్దమ్మా! ఇంకేమీ చెప్పొద్దు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనేదానివి కదా! మనిషయ్యాక అవసరమైనప్పుడు మానవత్వాన్ని ప్రకటించకపోతే ఎందుకమ్మా ఈ జన్మ? ఎదుటివాడు ఆకలని ఏడుస్తుంటే మనం తినేదానిలో ఒక్క ముద్దన్నా పెట్టలేకపోతే ఆ పుట్టుకకు అర్థమే

ముందమ్మా?''

''నేను కాదనడంలేదురా. కానీ దేవుడికి నైవేద్యం పెట్టకుండానే...''

మళ్లీ తల్లి మాటకు అడ్డువచ్చి ''ఈరోజు నిజంగా ఎంతో పుణ్యం అమ్మా, మనకు వుండి, లేనివాడికి పండ గపూట ఓ ముద్ద పెట్టడంలో ఎంతో తృప్తి వుందమ్మా. తినలేని రాతిబొమ్మ ముందు పెట్టి మళ్లీ మనమే తినడం కంటే ఆకలితో బాధపడేవాడికి పెట్టి 'భగవంతుడా! వాడిని ఈ ఆకలి బాధ నుండి తప్పించు' అని వేడుకోవ డంలో పుణ్యం, పరమార్థం లేదంటావా అమ్మా? ఇంత కంటే గొప్ప ఆత్మ సంతృప్తి ఎక్కడిదమ్మా? ఆకలేసిన పుడు కాదని, ఎప్పుడో పెడితే ఫలితమేముంటుం దమ్మా?'' అంటూ ఉపన్యాస ధోరణిలో మనసులో గూడు కట్టుకున్న అభిప్రాయాల్ని బయట పెట్టేసరికి తల్లి కళ్లల్లోకి నీళ్ళు తొంగి చూశాయి.

''అమ్మా! కన్నీళ్లా? నీకు బాధ కలిగించితే క్షమిం చమ్మా? తోటి మనిషి ఆకలితో బాధపడుతుంటే ఎప్పటి లాగే...'' అని ఇంకేదో చెప్పబోతున్న ప్రభాకరాన్ని-

''లేదురా నాయనా! ఇవి ఆనందభాష్పాలు. ఎప్పుడో మీ నాన్నగారుండే రోజులు గుర్తొచ్చాయి. ఆయన ఆలోచనలు, అభిరుచులు నీలో ఇంత ప్రస్ఫు టంగా చూడగలుగుతున్నందుకు ఆనందంగా వుందిరా.''

''అమ్మా!'' అంటూ తల్లి దగ్గరకు వచ్చిన ప్రభా కరం చెయ్యి పట్టుకుని ''అవును నాయనా! పండుగ వస్తే ఊరంతా మనింట్లోనే వుండేది. పేదలకు పిండివంట లతో భోజనాలు, కొత్త బట్టలు...ఇల్లంతా ఒకటే సందడి. ఇక్కడే మీ నాన్నగారికి నాకు అతికేదికాదు. ఆ గోవిందపు రంలో బాపూనగర్ ఉంది చూడు. ఆ స్థలం అంతా మీ తాతగారు ఇచ్చిందే'' అని గుర్తు చేసింది.

''అవునమ్మా! నాకు తెలుసు. తాతల నుండి జరుగు తున్న సేవా కార్యక్రమాలు, నా దగ్గరకు వచ్చేసరికి ఆగిపో వడం నాకు చాలా బాధగా వుందమ్మా. నేను వాళ్ల వారసు ణ్ణేకదా! నామీద వాళ్ల ప్రభావం కాస్తో కూస్తో వుంటుంది గదా'' అన్నాడు ప్రభాకరం.

''అవునురా. మీ నాన్నగారి ఆశయాలు ఆయనతోనే ఆగిపోకూడదు. ఇకనుండి ప్రతి పండగకి మనింట్లో పూర్వ వైభవం కనబడాలి'' అన్న తల్లి చేతిలో చెయ్యివేసి ''అలాగేనమ్మా. తప్పకుండా. నాన్నగారుండేప్పటి రోజులు నీ కళ్లముందుకొస్తాయి'' అన్నాడు ప్రభాకరమ్.

ఇంతలో నైవేద్యం అందుకుని వెళ్లిన ముష్టివాడు సరాసరి ఇంటి లోపలికి వచ్చాడు. అందరూ కంగారు పడుతుంటే ''ఏరా ప్రభాకర్ అలా చూస్తున్నావు? గుర్తు పట్టలేదా? ఓరి... నేను బావ కిశోర్‌ని'' అని వేషం కాస్త తీసేసాడు.

ఒక్కసారంతా షాక్ అయ్యారు.

కిశోర్ ఎవరోకాదు, రాజగోపాలంకి స్వయంగా చెల్లెలు కొడుకు. ప్రక్క ఊరే. ప్రభాకరానికి మేనత్త కొడుకు. ఈమధ్యనే పై చదువులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చాడు.



''ఏరా కిశోర్! నువ్వేదో ప్రేమలో పడ్డావని, పండక్కి అమ్మాయిని తీసుకువస్తావని అన్నాడు మీ నాన్న. ఈ ముష్టివాడి వేషం ఏమిట్రా. అంతా గందరగోళంగా వుంది'' అంది అనసూయమ్మ.

''ప్రేమా లేదు, దోమా లేదత్తయ్యా. మీ అన్నయ్య గారి రియాక్షన్ ఎలాగుంటుందోనని చిన్న డ్రామా. అంతే'' అన్నాడు కిశోర్.

''ఒరేయ్! నీ అల్లరింకా పోలేదురా! ఇంత వయసొ చ్చాక కూడా హైస్కూలు అల్లరింకా మానలేదురా'' అంది అనసూయమ్మ.

కిశోర్ వైపు చూస్తూ ''ఇంతకీ ముష్టివాడి వేషం ఎందుకు వేసినట్టో?'' అంది రాజ్యం.

''అదా...మొన్న అమ్మకి, నాన్నకి చిన్న డిస్కషన్ అయిందిలే మామయ్య గురించి. బావ గురించి కూడా. బావ ఊరికే ఆదర్శాలు, అవీ ఇదీ అని కబుర్లు చెబుతాడట. తీరా అత్తయ్యను కాదని ఏమీ చేయ లేదు. మావయ్యలాంటి ధైర్యవంతుడికి ఇలాంటి పిరికి వాడు పుట్టాడేంటి అనినాన్న అంటుంటే ఏదో పోటీలో వోడిపోయినట్టు అమ్మ మహా ఫీలయిపోయిందిలే. అందుకే బావవన్నీ వట్టి సొల్లు కబుర్లేనా, కనీసం సమయం వచ్చినప్పుడైనా తన ఆదర్శాలు నిలు పుకునే ప్రయత్నం చేస్తాడో లేదో చూద్దామని చిన్న...''చెబుతుండగా-

''డ్రామా అన్నమాట!'' అన్నాడు ప్రభాకరమ్.

''పోనీలే బాబూ! నా మనసును కప్పిన చాదస్తం కాస్త కరిగిపోయింది. నా ఆయుష్షు కూడా పోసుకుని నిండు నూరేళ్లు జీవించండి'' అని దీవించింది అనసూయమ్మ.

''సరే! అప్పుడే ఒంటిగంట దాటింది. కాళ్లు కడు క్కుని రండి. నైవేద్యం పెడతాను'' అంది రాజ్యం భోజ్యం చూస్తూ.

''ఆ...నైవేద్యం...నైవేద్యం'' అని అందరూ నవ్వుకు న్నారు.

☆

**యస్. ఆర్. పృథ్వి**